సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



కదలం.. జీతం వదలం

వైద్యారోగ్య శాఖలో అక్రమాలు బయటపడుతున్నాయి. ఇది కలకలం రేపుతోంది. - 8లో



దొంగే దొంగ అని..

పాతపట్నం టీడీపీలో చిచ్చు రాజుకుంది. ఎమ్మెల్యే మామిడి మాజీ ఎమ్మెల్యే కలమటపై విరుచుకుపడ్డారు. - 8లో

24న పలాసలో జాబ్‌మేళా

కాశీబుగ్గ: పలాసలోని డాక్టర్ కణితీస్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 24వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఫైల జవహర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో సినర్జి కాస్టింగ్, అపోలో ఫార్మసీ, అరబిందో, డెక్కన్ కెమికల్ ఫార్మా సంస్థలు హాజరవుతున్నాయని, పదో తరగతి నుంచి పీజీ వరకు చదువు పూర్తి చేసినవారు 18–35 ఏళ్ల మధ్య వయసు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 6301046329 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

రాజీనామాకు 28 డెడ్‌లైన్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఇద్దరు ఉన్నతాధికాల రాజీనామాకు ఈ నెల 28వ తేదీని డెడ్‌లైన్‌గా కూటమి ప్రభుత్వం పెట్టినట్లు సమాచారం. కీలక మంత్రి ఒత్తిడి తెస్తున్నట్లు వర్సిటీలో చర్చ సాగుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక వర్సిటీ అధికారులపై పడటంతో 17 మంది వీసీలు రాజీనామా చేశారు. వీరి స్థానాల్లో నియామకాలకు సైతం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో కొనసాగుతున్న బీఆర్ఏయూ అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకు వస్తున్నారు. పాలసీ మేటర్ అంటూ ప్రచారం చేస్తున్నారు. మరో పక్క ఇక్కడి అధికారులు పాలక మండలి సమావేశానికి ప్రయత్నించినా సమావేశం రద్దు చేశారు. అధికారులు సైతం రాజీనామా అంశంపై తర్జన భర్జనలు పడుతున్నట్లు సమాచారం.

హైకోర్టు జడ్జిలను కలిసిన జిల్లా అధికారులు



జస్టిస్ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తి, శ్రీకాకుళం జిల్లా పోర్ట్ పోలియో జడ్జి జస్టిస్ ఎస్.సుబ్బారెడ్డి, ఇతర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎం.రామకృష్ణారావు, జస్టిస్ యు.సత్యారావులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జునైద్ అహ్మద్ మౌలానా గౌరవ పూర్వకంగా కలుసుకున్నారు. అరసవల్లి రోడ్‌లోని సన్‌రైజ్ హోటల్‌లో వారికి శనివారం ఉదయం స్వాగతం పలికి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి సత్కరించారు.

25న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 25న నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి 2, 4, 1, 7వ స్థాయీ సంఘ సమావేశాలు, అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి 6, 3, 5వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లుగా జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ తెలియజేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైస్ చైర్‌పర్సన్లు పాలిన శ్రావణి, సిరిపురపు జగన్మోహనరావు, జంపు కన్నతల్లిల ఆధ్వర్యంలో జరుగనున్న మొత్తం 7 స్థాయీ సంఘ సమావేశాలకు తగు విధంగా సంబంధిత ప్రభుత్వ శాఖల ప్రగతి నివేదికలను ఆయా అధికారులు వెంట తీసుకురావాలని ఆయన సూచించారు.

ప్రైవేట్ బార్లకు మాత్రమే మద్యం సరఫరా

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రస్తుతం ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తున్న బార్లకు మాత్రమే మద్యం సరఫరా చేస్తున్నారు. జిల్లాలో 193 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 23 ప్రైవేట్ బార్లు ఉన్నాయి. ఈ నెల 18వ తేదీ నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలకు మద్యం సరఫరా చేయటం లేదు. ఎచ్చెర్ల ఏపీ బేవరేజెస్ గోదాం నుంచి మద్యం పంపిణీ చేసే ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీకి లక్షల్లో బేవరేజెస్ శాఖ రవాణా చార్జీలు బకాయి పడింది. బకాయిలు చెల్లించకపోవటంతో వీరు ట్రాన్స్‌పోర్టుకు ముందుకు రావటం లేదు. ప్రైవేట్ వ్యక్తుల చేతిలో బార్లు ఉండటం వల్ల వీరు తమకు కావాల్సిన ఇండెంట్ తీసుకువెళుతున్నారు. త్వరలో కొత్త మద్యం పాలసీ రానున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మద్యం దుకాణాలపై నిర్లక్ష్యం చేస్తోంది. లాభార్జన లేని ప్రభుత్వ దుకాణాలు పక్కపెట్టి, ప్రైవేట్ బార్లను ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే బార్లలో ఎంఆర్‌పీలతో సంబంధం లేకుండా ధరలు అమలవుతున్నాయి.

జగనన్న కాలనీ లేఅవుట్ పరిశీలన



కాలనీని పరిశీలిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు (వాకలవలస)లో గల జగనన్న అర్బన్ లేఅవుట్‌ను హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ రాజాబాబు శనివారం సందర్శించారు. కాలనీ అంతటినీ పరిశీలించి స్థానికంగా నివాసం ఉన్నవారితో మాట్లాడారు. త్వరితగతిన మౌలిక వసతులు కల్పించాలని కాలనీలో నివాసం ఉన్న వారంతా ఆయన్ను వేడుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



పాతికేళ్లు పటిష్టంగా ఉండాల్సిన భవనం పదేళ్లకే కూలిపోతే..? పది కాలాల పాటు బలంగా ఉండాల్సిన కట్టడం చూస్తుండగానే పేకమేడలా పడిపోతే..? జిల్లాలో ఇసుకాసురుల వికృత విన్యాసాలు ఈ ఉపద్రవాలను తెచ్చిపెట్టేలాగానే ఉన్నాయి. ఇప్పటికే వీరి ధన దాహానికి నదుల నుంచి నీరు కాకుండా కన్నీరు ప్రవహిస్తోంది. కానీ వీరి ఆకలి ఇంకా తీరలేదు. ఏకంగా సముద్రపు ఇసుకను సాధారణ ఇసుకలో కలిపి అమ్మేస్తున్నారు. ఈ ఇసుకనే జిల్లా నుంచి విశాఖకు తరలిస్తున్నారు. ఈ ఇసుకతోనే అక్కడ పెద్ద పెద్ద నిర్మాణాలు చేపడుతున్నారు. జిల్లాలోనూ ఈ ఇసుకనే చాలా మందికి విక్రయించారు. ఇదే ఇప్పుడు భయపెడుతోంది.



శా(o)డ్ స్టోరీ

సాధారణ ఇసుకలో సముద్రపు ఇసుక కలిపి అమ్మేస్తున్న అక్రమార్కులు

- కొత్త ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి అడ్డులేకుండా సాగుతున్న అక్రమాలు
- ఈ ఇసుక వాడితే తీవ్ర నష్టం తప్పదంటున్న నిపుణులు
- అధికారుల పర్యవేక్షణ కరువు

ఎచ్చెర్ల క్యాంపస్, వజ్రపుకొత్తూరు:

జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్లు పెద్దగా ఉనికిలో లేవన్న సంగతి జనాలకు తెలుసు. ఇసుక ఉచితమేనని ప్రభుత్వం చెబుతున్నా ఇంటికి తీసుకురావాలంటే తడిచి మోపెడవుతోందని కూడా వారికి తెలుసు. ఇసుక కావాలంటే అధికార నాయకులను సంప్రదించాలన్న సంగతి ఇంకా బాగా తెలుసు. కానీ తెలుసుకోవాల్సిన విషయం ఇంకొకటి ఉంది. జిల్లాలో అక్రమంగా అమ్ముతున్న ఇసుక నాణ్యమైనది కాదు. జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్ల కొరతను అదనుగా తీసుకున్న కొందరు వ్యాపారులు కల్తీ ఇసుకను అమ్మేస్తున్నారు. నది ఇసుకలో సముద్రం ఇసుకను కలిపేస్తూ ప్రమాదకరంగా వ్యాపారం చేస్తున్నారు. జిల్లా నుంచి ఎక్కువగా ఇసుక వినియోగం అవసరమైన విశాఖపట్నం తరలిస్తున్నారు. డిమాండ్ బట్టి అక్కడ 18 టన్నులు లారీ ఇసుక రూ.60వేల నుంచి రూ. 70 వేలు పలుకుతోంది. దీంతో ఇసుకాసురులకు కాసుల పంట పండుతోంది.



(ఫైల్)

ఎన్‌జీఆర్ పురం వద్ద సముద్రపు ఇసుక అక్రమ రవాణా



పదేళ్లకే శిథిలమైన నరసన్నపేట ఆస్పత్రి భవనాలు(ఫైల్)

రెండు ఇసుకలను కలపవచ్చా..?

సముద్రపు ఇసుకను నది ఇసుకలో కలిపి భవనం కడితే దాని జీవిత కాలం తగ్గిపోతుంది. ఇంజినీరింగ్ డిజైన్, నిర్మాణాల ప్రమాణం మేరకు ఓ భవనం 25 ఏళ్లు పటిష్టంగా ఉంటుంది. అయితే ఇసుక నాణ్యంగా లేకపోతే పదేళ్లకే పాడైపోతుంది. వాస్తవానికి నది ఇసుక నాణ్యత కూడా ల్యాబ్‌లో పరీక్షించాలి. నాణ్యంగా లేకపోతే సిమెంట్ శాతం పెంచాలి. కానీ ఉప్పు సాంద్రత ఉండే ఇసుకను కలిపి కడితే మాత్రం భవనాలు పేకమేడల్లా కూలిపోయే ప్రమాదముంది. ప్రస్తుతం జిల్లాలో 50 శాతానికిపైగా కల్తీ జరుగుతున్నట్లు సమాచారం.

ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారు..?

జిల్లాలో 193 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. 11 మండలాల పరిధిలో 200 గ్రామాలకు తీరం విస్తరించి ఉంది. ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లోని సముద్ర తీరప్రాంతమైన బుడగట్లపాలెం, బొంతల కోడూరు, కొచ్చెర్ల, ఎన్‌జీఆర్‌పురం, మెంటాడ ప్రాంతాల్లో కల్తీ ఇసుక వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోంది. ప్రతి రోజూ చీకటి పడ్డాక సముద్రపు ఇసుక, గెడ్డ ఇసుక ట్రాక్టర్లతో తీసుకువచ్చి సమీప తోటల్లో వేస్తారు. ఆ రెండు ఇసుకలను జేసీబీతో అర్ధరాత్రి మిక్సింగ్ చేసి కుప్పలుగా పోగులు చేసి ఉంచుతారు. అర్ధరాత్రి వేళల్లోనే భోగాపురం, రాజపులోవ, తగరపువలస వంటి ప్రాంతాల నుంచి వచ్చిన భారీ లారీల్లోకి ఎత్తి సొమ్ము చేసుకుంటున్నారు. వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి తీరాల్లోనూ ఇదే జరుగుతోంది.

ఇదిగో సాక్ష్యం పదేళ్లకే శిథిలం

నరసన్నపేటలో 2003లో నిర్మించిన ఆస్పత్రి భవనాలు పదేళ్లకే శిథిలమయ్యాయి. దీనికి కారణం కల్తీ ఇసుకను వినియోగించడమే. కాంట్రాక్టర్ సముద్రం ఇసుక తక్కువ ధరకు వస్తుందని పోలాకి మండలం రాజారాంపురం నుంచి తీసుకువచ్చి నిర్మాణ పనులు చేపట్టారు. అప్పట్లో సుమారు రూ.3.50కోట్లు వెచ్చించారు. అప్పటి సీఎం చంద్రబాబే ప్రారంభించారు. కానీ భవనాలు 2012కే శిథిలమైపోయాయి. 2015లో పూర్తిగా తొలగించాల్సి వచ్చింది. సముద్రపు ఉప్పు ఇసుక వాడకం వల్లే ఇలా జరిగిందని ఇంజినీర్లు తేల్చారు. – నరసన్నపేట



(ఫైల్)

ఎన్‌జీఆర్‌పురం సముద్రపు ఒడ్డున ట్రాక్టర్‌కు లోడ్ చేస్తున్న సముద్రపు ఇసుక

నిపుణుల మాట

నాణ్యత పరిశీలించాలి



భవన నిర్మాణంలో ఇసుక నాణ్యత కీలకం. కల్తీ ఇసుక నిర్మాణాలకు పనికి రాదు. నది ఇసుకలో 20 శాతం కంటే సముద్రపు ఇసుక కల్తీ జరిగితే 50 శాతం నాణ్యత దెబ్బతింటుంది. పురాతన ప్రాజెక్టులు, భవనాలు వంటివి పరిశీలిస్తే నాణ్యతకు ప్రాధాన్యత ఇచ్చారు కాబట్టే ఇప్పటికీ చెక్కు చెదర లేదు.

– ప్రొఫెసర్ వీకే చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్, శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్, ఎచ్చెర్ల

జీవితకాలం తగ్గిపోతుంది



ఇసుకలో నాణ్యత లోపిస్తే భవనం జీవితం కాలం తగ్గుతుంది. అందుకే నిర్మాణం చేపట్టే వారు ఇసుక పరీక్షించి నిర్మించాలి. సముద్రపు ఇసుక నిర్మాణాలకు పనికి రాదు. నది ఇసుకలో కలపటం వల్ల నిర్మాణాలు త్వరిత గతిన పాడవుతాయి.

– ప్రొఫెసర్ జీవీ ఉషశ్రీ, హెచ్ఓడీ, శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్, ఎచ్చెర్ల

పరీక్షించాకే వాడాలి..



కల్తీ ఇసుక అనేది నిర్మాణాల్లో చాలా ప్రమాదం. వాస్తవంగా నది ఇసుక సైతం పరీక్షించి నిర్మాణం చేపట్టాలి. అటు వంటిది సముద్రపు ఇసుక నది ఇసుకలో కలపటం వల్ల రసాయన చర్యలు జరిగి నిర్మాణాల నాణ్యత దెబ్బతింటుంది. విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్‌లు నిర్వహిస్తున్న వారు సొంతంగా ఇసుక స్టాక్ పాయింట్‌లు నుంచి తీసుకువెళ్లాలి. లేదంటే ల్యాబుల్లో పరీక్షించాక వినియోగించాలి.

– సీహెచ్ విజయభారతి, హెచ్ఓడీ, బీఆర్ఏయూ, సివిల్ ఇంజినీరింగ్ విభాగం

కల్తీ ఇసుక వాడితే ఏమవుతుంది..?

- సాధారణంగా సముద్ర తీర ప్రాంతాల్లో భవనాలు కొద్ది కాలానికే బీటలు వారుతాయి.
- కేవలం గాలి వల్లే అంత నష్టం ఉంటే ఆ ఇసుక వాడితో ఇంకెంత నష్టం ఉంటుందో ఊహించుకోవచ్చు.
- సముద్రపు ఇసుకలో ఉప్పు శాతం ఉంటుంది. కాంక్రీట్‌లో కలవదు.



- రసాయన చర్యలు జరుగుతాయి. దీంతో భవనాలు పెద్ద పెద్ద పగుళ్లు వస్తాయి.
- శ్లాబ్ పెచ్చులు ఊడుతాయి. ఐరన్ తుప్పు పడుతుంది.
- ఈ భవనాల్లో నివాసాలు సైతం ప్రమాదంగా మారే అవకాశం ఉంది.
- కాంట్రాక్టర్లు, బిల్డర్లు భవనాలు కట్టేసి అమ్మేస్తారు.
- ఈ ప్లాట్లు కొన్న వారు మాత్రం తీవ్రంగా నష్టపోతారు.
- మరో పక్క నది ఇసుక, సముద్రపు ఇసుక కల్తీని పసిగట్టటం సైతం అంత తేలిక కాదు. ల్యాబుల్లో పరీక్షిస్తేనే తెలుస్తుంది.

రాజముద్రతో పాస్ పుస్తకాలు జారీ



మెండ్రాయివలసలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

- దీపావళి నాడు ఉచిత గ్యాస్ పథకం
- తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందిస్తాం
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

నందిగాం: దీపావళి రోజున ఉచిత గ్యాస్ పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం మండలంలోని మెండ్రాయివలసలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన శాఖ పరిధిలో రూ.45వేల కోట్లు అప్పులున్నాయని తెలిపారు. అధికారం వచ్చిందని ఆనందం ఉన్నా ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సహకరించడం వల్ల వందరోజుల్లో కొంత సంక్షేమం సాధించినట్లు చెప్పారు. అర్హత లేని వారిని పింఛన్లు అందుతుంటే ఆయా గ్రామస్తులు తెలియజేయాలని సూచించారు. పేపర్లో అర్హత లేని వారికి పింఛన్లు అందుతున్నట్లు వస్తే కలెక్టర్‌కు చెప్పి విచారణ చేయించామని తెలిపారు. త్వరలో రాజముద్రతో పాసుపుస్తకాలు అందజేస్తామని, తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందిస్తామని అన్నారు. అలాగే ఆకులరఘునాథపురంలో మురుగనీటి కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నారని, సుబ్బమ్మపేటలో తాగునీటికి ఇబ్బందులు ఉన్నాయని, ప్రతి ఇంట్లో జ్వరాలతో బాధపడుతున్నారని వాటికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పలాస ఆర్డీఓ భరత్ నాయక్, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాఖండ్యాంలో ఇసుక అక్రమ రవాణా



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: బూర్జ మండలం కాఖండ్యాం ఇసుక డీసిల్టేషన్ పాయింట్‌లో అక్రమ రవాణా జరుగుతుంది. నదీ గర్భంలో మిషనరీలను దించకూడదని నిబంధనలు ఉన్నా నదీ గర్భంలో స్టాక్ పాయింట్ ఏర్పరచి, నదీ గర్భంలోనే లోడింగ్ చేస్తున్నారు. చెక్ పోస్ట్ దాటి లోపలికి వాహనాలు అనుమతి లేనప్పటికీ రాత్రిపూట నదీ గర్భంలో నుంచి స్టాక్ పాయింట్లకు ఇసుకను తరలించి సరఫరా చేస్తున్నారు. గత ఐదు రోజులుగా అక్రమ రవాణాకు పాల్పడిన ఐదు లారీలను లోపల అడ్డుకున్నప్పటికీ ఈరోజు వాటిలో రెండింటికి కొత్తగా చలానాలను తీసి బయటకు పంపించారు. ఇక్కడ అక్రమ రవాణా జోరుగా జరుగుతోంది.

గంజాయి అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు

- విశాఖ రేంజి డీఐజీ గోపీనాథ్ జట్టి



మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జట్టి, పక్కనే ఎస్పీ, అడిషనల్ ఎస్పీలు

శ్రీకాకుళం క్రైమ్ : ప్రస్తుత కాలంలో పట్టణ ప్రాంతాల్లోనే కాక గ్రామీణ ప్రాంతాల్లో సైతం సైబర్ నేరాలు అధికంగా నమోదవుతున్నాయని, సైబర్ నేరగాళ్లు చూపించే లేనిపోని ఆఫర్లకు, ఆకర్షణలకు లోనై వారి వలలో పడి అధిక మొత్తంలో ప్రజలు నగదు కోల్పోతున్నారని డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. విశాఖ రేంజి డీఐజీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా జిల్లాకు విచ్చేసిన గోపీనాథ్ జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో ప్రజలకు సైబర్ మోసాలపై అవగాహన పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. వీటి ఉచ్చులో పడితే 1930 లేదా నేషనల్ సైబర్‌క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

'గంజాయి'కి ప్రత్యేక బృందాలు..

జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ ఒడిశా బోర్డర్ ఉండటంతో అక్రమ రవాణా జరుగుతోందని, అరికట్టేందుకు ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడమే కాక వాటి ద్వారా కొంతమందిని గుర్తించి కేసులు కూడా పెట్టడం జరిగిందన్నారు. మరికొందరిని అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు. రేంజి పరిధిలో గంజాయి క్రయవిక్రయాల సాగు, వినియోగ నివారణలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 13 మండలాలను గుర్తించి ఈ మూడేళ్లలో పదివేల ఎకరాల్లో గంజాయి పంటను నిర్వీర్యం చేశామన్నారు. అక్కడి రైతులకు ప్రత్యామ్నాయంగా సాగు పంటల విత్తనాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లో రేంజి పరిధిలో మావోయిస్టుల ప్రభావం కొంతమేర తగ్గిందని డీఐజీ వివరించారు. సమావేశంలో డీఐజీతో పాటు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, రెండో పట్టణ సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీసు ప్రతిష్ట పెంచండి

జిల్లా పోలీసులు సంస్థ ప్రతిష్ట పెరిగేలా పనిచేయాలని విశాఖపట్నం రేంజి డీఐజీ గోపీనాథ్ జట్టి సూచించారు. జిల్లాకు డీఐజీ హోదాలో శనివారం విచ్చేసిన ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సమక్షంలో అధికార యంత్రాంగంతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారితో మర్యాదగా మెలగాలని, తప్పు చేసే అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా పోస్టులపై నిఘా పెట్టాలన్నారు. ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు కొన్ని చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. సైబర్ నేరాలు, మైనర్ రైడింగ్‌లపై అవగాహన పెంచుతున్నామన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, జిల్లావ్యాప్తంగా ఉన్న అధికారయంత్రాంగం పాల్గొన్నారు.

జీఓ 85 రద్దు చేయాల్సిందే

అరసవల్లి: పీజీ సీట్లలో ప్రభుత్వ వైద్యుల ఇన్‌సర్వీస్ కోటా కుదింపు జీఓ 85ను వెంటనే రద్దు చేయాల్సిందేనని జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు నిర్వహిస్తున్న నిరసనల కార్యక్రమాల్లో భాగంగా శనివారం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయం ఎదుట నల్లరిబ్బన్లను నోటికి కట్టుకుని నిరసన చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీ వైద్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని శాంతియుతంగా నిరసన తెలిపారు. డీఎంహెచ్ఓ లేకపోవడంతో సోమవారం కూడా నిరసన కొనసాగించాలని నిర్ణయించారు.



డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

దేవుడి పేరుతో రాజకీయాలు సరికాదు

- మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస వాసుదేవుని ఆలయంలో శనివారం ఉదయం ఆయన పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. దేవుడి ప్రతిష్టను బజారుకీడ్చడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే సాధ్యపడిందని విమర్శించారు. ప్రసాదాలు, నైవేద్యాలకు వాడే మెటీరియల్‌ను తిరుమల తిరుపతి దేవస్థానంలో క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్ సర్టిఫైడ్ చేసిన అనంతరమే వాడుతారని నాసిరకం మెటీరియల్ వాడటానికి అవకాశం లేదన్నారు. భగవంతుని ప్రతిష్టకు మచ్చ కలిగించే విధంగా ప్రసాదంలో కల్తీ జరిగినట్లు మాట్లాడుతున్న కొంతమంది వ్యక్తులకు మంచి బుద్ధి ప్రసాదించాలని ప్రార్థించినట్లు తెలిపారు. నచ్చిన రేటుకి, నచ్చిన కాంట్రాక్టర్‌కు నెయ్యి అప్పగించేందుకు పన్నిన పన్నాగంలో భాగంగా ఈ రాద్ధాంతం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. దేవదేవునిపై రాజకీయాలు చేస్తే నామ రూపాలు లేకుండా పోతారని హెచ్చరించారు. నందిని కంపెనీకి నెయ్యి సరఫరా ఎందుకు ఇవ్వరని లోకేష్ మాట్లాడుతూ ప్రశ్నించారని, అది హెరిటేజ్ సంస్థకు అనుబంధంగా ఉందని అన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో తమిళనాడుకు చెందిన అగ్రిఫుడ్ సంస్థ శ్రీవారి ప్రసాదానికి వాడే నెయ్యి టెండర్ దక్కించుకుందని అవి ల్యాబ్ పరీక్షల అనంతరం దేవస్థానానికి చేరుకుంటాయని అన్నారు. జూన్ నెలలో నాణ్యత లేకపోవడంతో నాలుగు ట్యాంకర్‌లను వెనుక్కు పంపించారని అదే వైఎస్సార్ సీపీ హయాంలో 18 ట్యాంకర్లు నాణ్యత లేనివని టీటీడీ ల్యాబ్ నిర్ధారించిన తర్వాత వెనక్కి పంపించారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడులో పుణ్యక్షేత్రాల ప్రాముఖ్యతను తగ్గించే విధంగా వాటి పవిత్రతపై అనుమానాలు రేకెత్తించడం దురదృష్టకరమైన సంఘటన అన్నారు. ఈ ప్రచారాలను ప్రజలు ఎవ్వరూ నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో మందస ఎంపీపీ డొక్కరి దానయ్యతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, బోర కృష్ణారావు, అందాల శేషగిరి, బృందా తదితరులు పాల్గొన్నారు.



మందస వాసుదేవ మందిరంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

క్లుప్తంగా

సాగునీరు అందించాలని ధర్నా



ధర్నా చేస్తున్న కౌలు రైతులు

జి.సిగడాం: తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టుల ద్వారా రైతులకు సకాలంలో సాగునీరు అందిస్తామని చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కౌలు రైతు సంఘం నాయకుడు వెలమల రమణ కోరారు. ఈ మేరకు శనివారం కౌలు రైతులతో కలిసి బాతువ గ్రామ సమీపంలో తోటపల్లి కాలువ వద్ద ధర్నా నిర్వహించారు. బోరప తివాని చెరువు వద్ద షట్టర్లు ఏర్పాటు చేయాలని, మొక్క జొన్నరైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సింహాచలం, లక్ష్మణరావు, అసిరినాయుడు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఔదార్యం



బైక్ డ్రైవ్ చేస్తూ ఫాగింగ్ చేయిస్తున్న సర్పంచ్ సింహాచలం

కంచిలి: మండలంలోని బొగాబెణి పంచాయతీ పరిధిలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత గణప సింహాచలం ఫాగింగ్ చేయిస్తున్నారు. ద్విచక్ర వాహనాన్ని స్వయంగా నడుపుతూ ఓ మనిషి సాయంతో ఫాగింగ్ యంత్రం ద్వారా అన్ని గ్రామాల్లో దోమల నివారణ మందు స్ప్రే చేయించారు. సర్పంచ్ తనే స్వయంగా వాహనం నడుపుతూ వ్యాధులు నివారణకు ఇలా ప్రజాసేవ చేయడంపై స్థానికులు అభినందిస్తున్నారు.

విద్యార్థుల్లో సేవాభావం పెరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జూనియర్ /యూత్ రెడ్‌క్రాస్‌ల ద్వారా యువతలో సేవాభావం పెంచాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జూనియర్ /యూత్ రెడ్‌క్రాస్ సమీక్ష నిర్వహించారు. వివిధ సేవా కార్యక్రమాలను సెక్రటరీ బి.మల్లేశ్వరరావు వివరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావం పెరిగేలా పాఠశాలలు, కళాశాలల్లో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

7న జిల్లా స్థాయి ఓపెన్ కబడ్డీ పోటీలు

వజ్రపుకొత్తూరు : సరస్వతీ పూజ సందర్భంగా ఉద్దానం రామకృష్ణాపురంలో అక్టోబర్ 7 నుంచి 9 వరకు జిల్లా స్థాయి ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలకు ప్రవేశ రుసుం ఉచితమని, అల్పాహారం, భోజన సదుపాయం ఉంటుందని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.30వేలు, ద్వితీయ రూ.25వేలు, తృతీయ రూ.20 వేలు, 4వ బహుమతి రూ.15వేలుతో పాటు షీల్డులు ఉంటాయని తెలిపారు. వివరాలకు 7382095831, 9704695435 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రతికూల ఆలోచనలు అనర్థం



మాట్లాడుతున్న సైకాలజీ కౌన్సెలర్ ఎం.వి.ఆర్.రాజు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు ప్రతికూల ఆలోచనలకు దూరంగా ఉండాలని విశాఖలోని ఆంధ్రా విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రముఖ సైకాలజీ కౌన్సెలర్ ప్రొఫెసర్ ఎం.వి.ఆర్.రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో శనివారం సెంటర్ ఫర్ సైకలాజికల్ అసెస్మెంట్ అండ్ కౌన్సెలింగ్ సంస్థ ఆధ్వర్యంలో 'ప్రపంచ ఆత్మ హత్యల నివారణ దినోత్సవం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎప్పుడు నిరాశ, నిస్పృహ, కోపం, ఒత్తిడికి గురికాకూడదన్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత జీవనశైలికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో వీసీ కె.ఆర్.రజిని, రిజిస్ట్రార్ పి.సుజాత, రెక్టార్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాళ్లు ఎం.అనురాధ, ఎస్.ఉదయ్‌భాస్కర్, సీ.హెచ్.రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

కదలం.. జీతం వదలం



మూతపడిన కోవిడ్ శాంపిల్ యూనిట్

- జిల్లా వైద్యారోగ్య శాఖలో బయటపడుతున్న అక్రమాలు
- డిప్యుటేషన్లు రద్దు చేసినా వర్కింగ్ ప్లేస్‌లకు వెళ్లని కొందరు ఉద్యోగులు
- కోవిడ్ శాంపిల్ యూనిట్ మూసివేసినా పట్టించుకోని వైనం
- జీతం మాత్రం ఠంఛన్‌గా ఇచ్చేస్తున్న మెడికల్ ఆఫీసర్లు

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖలో అక్రమాల లీలలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం కోసం డబ్బులిచ్చి మోసపోవడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నగరానికి చెందిన ఓ మహిళ ఉదంతంతో అసలు డొంక కదులుతోంది. ఎక్కడో ఉద్యోగం.. పెత్తనం మాత్రం ఇక్కడే అన్నట్లుగా జిల్లా కేంద్రంలోనే ఉంటూ ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్న వైద్యారోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగి జి.వి.నరసింహం (సింహం) బాగోతం బట్టబయలవుతోంది. ఆశావహులకు ఉద్యోగాలిప్పిస్తామంటూ..డబ్బులు తీసుకుని ఫోర్జరీ సంతకాలతో ఫేక్ జాయినింగ్ ఆర్డర్లు ఇచ్చేసేలా అక్రమాలకు, మోసాలకు పాల్పడుతున్నట్లు తీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి. ఇలాంటి కోటరీకి కేంద్రబిందువుగా కీలక ఉద్యోగి అంతా తానై వ్యవహరిస్తున్నట్లుగా తెలుస్తోంది.

శాంపుల్ యూనిట్ ఎత్తేసినా..

జిల్లాలో కోవిడ్ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆవరణలో శాంపుల్ యూనిట్‌ను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆ తర్వాత కోవిడ్ తీవ్రత తగ్గడంతో ఆయా యూనిట్లను ఎత్తివేసింది. అక్కడ డిప్యుటేషన్లపై పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులను కూడా వారి యథాస్థానాలకు వెళ్లిపోవాలని ఈ ఏడాది ఏప్రిల్ 8న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ యూనిట్ గదికి తాళాలు సైతం వేసేశారు. ఇందులో పలాస అర్బన్ పీహెచ్‌సీకి చెందిన గోపి మాత్రమే విధుల్లోకి చేరగా.. కంచిలి పీహెచ్‌సీకి చెందిన ఎం.పురుషోత్తం కీలక ఉద్యోగి సాయంతో కంచిలికి వెళ్లకుండా తిలారు పీహెచ్‌సీకి బదిలీ చేయించుకున్నాడు. తీరా అక్కడికి వెళ్తే.. పురుషోత్తం ఈ పీహెచ్‌సీకి వద్దంటూ మెడికల్ ఆఫీసర్ లెటర్ రాసి డీఎంహెచ్‌వో మీనాక్షికి అందజేశారు. ఇక మిగిలిన జి.వి.నరసింహం మాత్రం మాకివలస పీహెచ్‌సీకి వెళ్లకుండా జిల్లా కేంద్రంలోనే మకాం వేశారు. అయినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు.

బాధితురాలి ఆత్మహత్యాయత్నంతో తెరపైకి..

తాజాగా ఓ బాధితురాలు ఆత్మహత్యాయత్నం చేసుకోవడంతో ఇవన్నీ తెరమీదకొచ్చాయి. నరసింహం పీహెచ్‌సీకి వెళ్లకపోయినా మాకివలస పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ప్రతినెలా ఠంచన్‌గా జీతాన్ని ఎలా ఇచ్చేస్తున్నారనే విషయం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

విచారణ వేస్తే మరిన్ని అక్రమాలు..

వైద్యారోగ్య శాఖలో కొన్నేళ్లుగా ఉద్యోగాల నియామకాలు, బదిలీలు, పదోన్నతులు, సీనియార్టీ జాబితాలో అక్రమాలు, ఫేక్ సర్టిఫికెట్లుతో ఉద్యోగాలు పొందిన వైనం.. తదితర అంశాలు ఓ కుదుపుకుదుపేస్తున్నాయి. గత ప్రభుత్వం హయాంలో ఎంతో పారదర్శకంగా అర్హులకే ఉద్యోగాలిచ్చినప్పటికీ.. తెరవెనుక మాత్రం కొందరు డబ్బులు దండేసి అక్రమాలకు పాల్పడినట్లుగా అప్పట్లోనే వెలుగులోకి వచ్చాయి. ఇప్పుడు వాటి కొనసాగింపుగా బాధితులు ఒక్కొక్కరిగా బయటకొస్తున్నారు. ఒకరు ఆత్మహత్యయత్నానికి పాల్పడితే..మరొకరు డీఎంహెచ్‌ఓ మీనాక్షి దగ్గరకు ఫేక్ జాయినింగ్ ఆర్డర్‌ను పట్టుకుని వెళ్లారు. ఇంకొకరైతే.. డీఎంహెచ్‌వో ఎదురుగా ఉన్న ఓ అటెండర్‌కు డబ్బులిచ్చామంటూ ఫిర్యాదు చేశారు. ఇలాంటివి పదుల సంఖ్యలో ఉన్నాయన్న సమాచారం తెలుస్తోంది. అసలు ఈ అక్రమాలపై విచారణకు ఉన్నతాధికారులు ఆదేశిస్తే కచ్చితంగా కోటరీ ఏంటో.. అసలు నిందితులెవరో తేలే అవకాశముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని ప్రత్యేకంగా విచారణకు ఆదేశించాలని అటు బాధితులు..ఇటు శాఖ ఉద్యోగులు కూడా కోరుతున్నారు.



శాంపుల్ యూనిట్‌లో ఉద్యోగుల డిప్యుటేషన్లను రద్దు చేసినట్లుగా డీఎంహెచ్‌వో ఆదేశాలు ఇవే

డ్యూటీ సర్టిఫికెట్ తీసుకొస్తేనే..

నరసన్నపేట: ఈ విషయమై మాకివలస పీహెచ్‌సీ వైద్యాధికారి శిరీష వద్ద ప్రస్తావించగా డీఎంహెచ్‌ఓ నుంచి డిప్యుటేషన్ క్యాన్సిలేషన్ ఆర్డర్లు రాకపోవడం వల్ల జీతాలు చెల్లించామని, గత నెలలో ఆర్డర్ రావడంతో డిప్యుటేషన్ రద్దు చేశామన్నారు. అయితే రద్దు అనంతరం కూడా ఆయన విధులకు రావడం లేదని తెలిసింది. ఈ నెల డ్యూటీ సర్టిఫికెట్ తీసుకువస్తేనే జీతం రాస్తామని యూడీసీ ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు.

జీతాలివ్వడంపై వివరణ కోరా...



శాంపుల్ యూనిట్‌ను రద్దు చేసిన తర్వాత యథాస్థానాలకు వెళ్లి పని చేయని వారికి జీతాలు ఇవ్వొద్దని కచ్చితంగా ఆదేశించాం..అయినప్పటికి మాకివలస పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఎలా జీతాన్నిచ్చారనేదానిపై వివరణ కోరాను. ఇలాంటి అక్రమాలను ప్రోత్సహించేది లేదు. మా శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులే.. ఉద్యోగాలిస్తామని మోసం చేయడం దారుణం..దీనిపై విచారణ కోసం ఉన్నతాధికారులను కోరుతా.

– డాక్టర్ బి.మీనాక్షి, డీఎంహెచ్‌వో

ప్రజలను క్లీన్‌బౌల్డ్ చేశారు

- వంద రోజుల పాలనపై ఎమ్మెల్సీ నర్తు రామారావు ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: కూటమి ప్రభుత్వం సంక్షేమానికి గండికొట్టి పేదల్ని క్లీన్ బౌల్డ్ చేసిందని ఎమ్మెల్సీ నర్తు రామారావు ధ్వజమెత్తారు. కొత్తపుట్టుగలో తన నివాసంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నవరత్న పథకాల్ని కొనసాగించలేని అసమర్ధ ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం నిలిచిందన్నారు. కేవలం పెన్షన్లు చెల్లించి ఏదో సాధించామనే భ్రమల్లో ప్రజల్ని తప్పుదోవపట్టిస్తున్నారని మండిపడ్డారు. ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతకు అభాసుపాలవుతామనే ఇంటిలిజెన్స్ నివేదికలు అందడం వల్లే చంద్రబాబు రాజపురం పర్యటనను రద్దు చేసుకున్నారని విమర్శించారు. వందరోజుల పాలన వైఫల్యానికి ఇదే నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఓట్లేసి గెలిపించిన ప్రజల సంక్షేమాన్ని కొనసాగించి న్యాయం చేయాలని కోరారు.

సమావేశంలో కవిటి ఎంపీపీ కడియాల పద్మ, మాజీ ఎంపీపీ నర్తు చామంతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, కరగాన వల్లభరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చలేకే దేవుడిపై రాజకీయాలు

- చంద్రబాబు 100 రోజుల పాలనపై చింతాడ రవికుమార్ ధ్వజం



మాట్లాడుతున్న పార్టీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ఇది మంచి ప్రభుత్వం కాదని, ప్రజలను ముంచే ప్రభుత్వమని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ ధ్వజమెత్తారు. ఆమదాలవలసలోని జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నెరవేర్చలేకే తిరుమల వెంకటేశ్వర స్వామిపై రాజకీయాలు చేస్తూ చంద్రబాబు, ఎల్లో మీడియా కుట్ర పన్నుతున్నాయని మండిపడ్డారు. చంద్రబాబు 100 రోజుల పాలన అంతా రాజకీయ కక్షసాధింపు, హత్యలు,అత్యాచారాలు, అక్రమాలు, దోపిడీలేనని దుయ్యబట్టారు. చంద్రబాబు రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం రాష్ట్ర సంపదను మునిగి పోయే అమరావతిలో పోస్తున్నారని, ఈ విషయాన్ని సాక్షాత్తు ప్రపంచ బ్యాంకే తన నివేదికలో తెలిపిందన్నారు. పథకాలు అందక అన్ని వర్గాలు అసహనంతో ఉన్నారని చెప్పారు. చంద్రబాబుకు ధైర్యం ఉంటే తిరుమల ప్రసాదం విషయంలో సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ కార్యకర్తలు కొప్పల ఈశ్వరరావు, అన్నెపు కృష్ణ, రాఘవేంద్రరావు, రామ్మోహన్ పాల్గొన్నారు.

దొంగే.. దొంగ అని అరుస్తున్నట్లుంది

- మాజీ ఎమ్మెల్యే కలమటపై పాతపట్నం ఎమ్మెల్యే మామిడి పరోక్షంగా ఫైర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

ఎల్.ఎన్.పేట: 2014 నుంచి 2019 వరకు ఇసుక వ్యాపారం చేసుకుని కాసులు వెనకేసుకున్న దొంగే ఇప్పుడు.. దొంగ దొంగ అని అరుస్తున్నట్లు ఉందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దుయ్యబట్టారు. దబ్బపాడులో శనివారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇసుక వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణపై పరోక్షంగా ఫైర్ అయ్యారు. పాతపట్నం నియోజకవర్గంలో ప్రతిపక్షంతో పాటు స్వపక్ష నాయకులతో తాను ఫైట్ చేయాల్సి వచ్చిందని.. అయినా ఎవరికీ భయపడేది లేదని స్పష్టం చేశారు. తాను పేదరికం నుంచి వచ్చానని, పేదల కష్టాలు తెలుసని, ఏదైనా మంచి చేయాలన్నదే తన అభిమతమని చెప్పారు. ఇది చూసి ఓర్వలేని స్వపక్ష నాయకులు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇసుక అక్రమ వ్యవహారంలో తన ప్రమేయం లేకపోయినా బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. నియోజకవర్గం ప్రజలకు ఎవరేమిటో తెలుసని వ్యాఖ్యానించారు. 2014 నుంచి 2019 వరకు దొరికినంత ఇసుక అమ్ముకున్న వ్యక్తులే ఇప్పుడు నిజాయతీపరులుగా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పాతపట్నంలో ప్రభుత్వ పాఠశాల భూమిని ఆక్రమించుకున్న నాయకుల సంగతి తేల్చుతానని ఎమ్మెల్యే హెచ్చరించారు.

ఇసుక లారీలను అడ్డుకున్న పాతపట్నం ఎమ్మెల్యే

సరుబుజ్జిలి: ఒడిశా రాష్ట్రం గుమ్మడ తదితర ప్రాంతాల చిరునామాతో వస్తున్న ఇసుక లారీలను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శనివారం కొత్తకోట జంక్షన్ వద్ద అడ్డుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై చంద్రినాయుడు చేరుకోగానే.. మూడు లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేయాలని, అక్రమ రవాణా విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఒడిశా రాష్ట్రం గుమ్మడ ర్యాంపు నుంచి వివిధ కంపెనీల పేరిట విశాఖపట్నానికి ఇసుక తరలిస్తున్నట్లు పత్రాల్లో ఉండగా.. లారీ డ్రైవర్లు, క్లీనర్లు మాత్రం భామిని నుంచి ఇసుక తరలిస్తున్నట్లు పొంతనలేని సమాధానాలిస్తున్నారు. వాస్తవానికి భామినిలో అధికార ఇసుక ర్యాంపు లేదు. ఈ విషయమై ఏఎస్సై చంద్రినాయుడు వద్ద ప్రస్తావించగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వాహనాలను అదుపులోకి తీసుకున్నామని, విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు.

స్మార్ట్ మీటర్లు వెనక్కి పంపించాలి: సీపీఎం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాకు వచ్చిన స్మార్ట్ మీటర్లు వెనక్కి పంపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించిన టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు బిగిస్తోందని ప్రశ్నించారు. నివాస గృహాలకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు పెట్టడం దారుణమన్నారు.

రక్తదాతలు ముందుకురావాలి



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కల్చరల్: ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్అండ్‌బీ ఈఈ కార్యాలయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఎస్ఈ కె.జాన్ సుధాకర్, ఈఈ ఎస్.రవినాయుడులను అభినందించారు. ప్లేట్‌లెట్స్ తగ్గి చాలా మంది రోగులు ఇబ్బంది పడుతున్నారని, ఇలాంటి సమయంలో యువత పెద్ద ఎత్తున రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వ శాఖలన్నింటిలోనూ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 70వేల మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. అనందరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, పెంకి చైతన్యకుమార్, ఆర్అండ్‌బీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కులగణనతోనే బీసీలకు న్యాయం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/శ్రీకాకుళం: బీసీ కులగణనతోనే రాజ్యాంగ ఫలాలు బీసీలకు అందుతాయని బహుజన సమాజ్‌వాద్ పార్టీ ఉభయ రాష్ట్రాల కో–ఆర్డినేటర్ డాక్టర్ జె.పూర్ణచంద్రరావు అన్నారు. బీసీ కులగణన కోరుతూ బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి పిలుపునిచ్చిందని, దీనిలో భాగంగా అక్టోబర్ 9న విజయవాడలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం శ్రీకాకుళంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో బీసీ అసెంబ్లీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరరావు మాట్లాడుతూ ఎవరేమనుకున్నా ఇప్పుడు రాష్ట్రం కులాంధ్రప్రదేశ్‌గా మారిపోయిందన్నారు. అదే పేరుతో ఆయన, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతితో కలిసి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎల్. గరికవాడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాడేరు మాజీ ఎమ్మెల్యే కె.రాజారావు, రచయిత నల్లి ధర్మారావు, డాక్టర్ అరవింద్, బొడ్డేపల్లి మోహన్‌రావు, టి.తిరుపతిరావు, వి.కృష్ణారావు, షావుకారు నాగేశ్వరరావు, అలపాన త్రినాథ రెడ్డి, మహిబుల్లా ఖాన్, రౌతు శంకరరావు, బాడాన దేవభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి టు నేపాల్

నరసన్నపేట: పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు గరివిడి మండలం కె.పాలవలస గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి కె.హరికృష్ణ చీపురుపల్లి నుంచి నేపాల్‌కు సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టాడు. శనివారం జమ్ము కూడలి వద్దకు చేరిన హరికృష్ణ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ముఖ్యంగా యువత పర్యావరణంపై ప్రచారం చేయాలని కోరారు.



సైకిల్‌యాత్ర చేపట్టిన హరికృష్ణ

నేడు సబ్ రిజిస్ట్రార్లకు బదిలీల కౌన్సెలింగ్

- 64 మందిలో 48 మంది బదిలీలకు అవకాశం
- సీనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్ల బదిలీలు నేటితో పూర్తి
- మంచి స్థానాల కోసం భారీ పైరవీలు

విశాఖ సిటీ: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలకు ఈ నెల 22వ తేదీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉత్తరాంధ్ర (ఉమ్మడి విశాఖ, ఉమ్మడి విజయనగరం, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాల పరిధి) జోన్‌లో మొత్తం 64 సబ్ రిజిస్ట్రార్లు ఉండగా.. తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా ఇందులో 48 మంది సబ్ రిజిస్ట్రార్లు బదిలీ కానున్నారు. మార్చి నెలలో పదవీ విరమణ చేయనున్న సబ్ రిజిస్ట్రార్లకు బదిలీల జాబితా నుంచి మినహాయించారు. ఇందులో ఆనందపురం, పాలకొండ సబ్ రిజిస్ట్రార్ వచ్చే ఏడాది మార్చిలోగా పదవీ విరమణ చేయనుండటంతో ఈ స్థానాలను మినహాయించారు. ప్రధానంగా మధురవాడ, భీమిలి, సూపర్ బజార్ ఆర్వో, ద్వారకానగర్, అనకాపల్లి, విజయనగరం, విజయనగరం వెస్ట్, శ్రీకాకుళం టౌన్‌తో పాటు కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చేందుకు పలువురు సబ్‌రిజిస్ట్రార్లు పైరవీలు చేసుకుంటున్నారు. తాజా మార్గదర్శకాలతో భోగాపురం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం కాస్తా కేటగిరీ–సీలో మారడంతో ఈ స్థానానికి వచ్చేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. అయితే అంతా కౌన్సెలింగ్ ద్వారానే జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నా.. అధికార పార్టీ నేతల ద్వారా పైరవీలతో పాటు భారీ ఎత్తున ముడుపులు సమర్పించుకునే వారికి మంచి పోస్టింగులు దక్కే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. విశాఖ డీఐజీ బాలకృష్ణ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఈ కౌన్సెలింగ్ టీమ్‌లో విజయనగరం డీఐజీ సభ్యులుగా ఉన్నారు. ప్రధాన కార్యాలయం నుంచి జాయింట్ ఐజీ టి.సరోజ పరిశీలకులుగా వచ్చారు. సబ్ రిజిస్ట్రార్లతో పాటు సీనియర్ అసిస్టెంట్స్, ఆఫీస్ సబార్డినేట్స్ బదిలీలను ఆదివారంతో పూర్తి చేయనున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

వైద్య విద్య ప్రైవేటీకరణ ఆపాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ ప్రతినిధులు

టెక్కలి: రాష్ట్రంలో విద్య, వైద్యాన్ని ప్రైవేట్‌పరం చేయాలనే కూటమి ప్రభుత్వం ఆలోచనలను తక్షణమే విరమించుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. టెక్కలిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి కొత్తగా 17 మెడికల్ కళాశాలలు మంజూరయ్యాయని.. వాటిలో 2023లో ఐదు కళాశాలలు ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. ఈ విద్యా సంవత్సరంలో మరో ఐదు కళాశాలలు ప్రారంభం కావాల్సి ఉండగా పులివెందుల కళాశాలకు సీట్లు అవసరం లేదని కూటమి ప్రభుత్వం ఎన్ఎంసీకు లేఖ రాయడం దారుణమన్నారు. దీనివల్ల రాష్ట్రానికి రావాల్సిన 700 మెడికల్ సీట్లు కోల్పోయే ప్రమాదం వాటిల్లిందన్నారు. రాష్ట్రంలో వైద్య విద్యను ప్రైవేట్‌పరం చేయాలనే ఆలోచనలను విరమించుకోవాలన్నారు. యువగళం పాదయాత్రలో విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈయనతో పాటు ప్రతినిధులు ఆర్.మహేష్, ధర్మారావు తదితరులు ఉన్నారు.

వివాహిత మృతి

కొత్తూరు: మండలంలోని పారాపురం గ్రామానికి చెందిన సుబుద్ధి బాలామణి(30) పురుగుల మందు తాగడంతో చికిత్స పొందుతూ శ్రీకాకుళం రిమ్స్‌లో శనివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ ఎం.ఏ.అహ్మద్ తెలిపారు. బాలామణి తన పెద్దమ్మకొడుకుకు రూ.రెండు లక్షలన్నర అప్పు ఇచ్చింది. ఆ సొమ్మును తిరిగి ఇవ్వకుండా పరారవడంతో బాలామణి మనస్తాపం చెంది ఈ నెల 18న ఇంటి వద్ద పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు కొత్తూరు సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌లో చేర్పించగా వైద్యం పొందుతూ శనివారం మృతి చెందింది. ఒడిశా రాష్ట్రం రామన్నగూడకు చెందిన మృతురాలి తల్లి మల్లా అరుణకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. బాలామణికి భర్త తేజేశ్వరరావు, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన మల్లేశ్వరరావు

టెక్కలి రూరల్: లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన రావివలస మల్లేశ్వరరావు(36) కొద్ది రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. శనివారం సాయంత్రం మద్యం తాగి టెక్కలి పాతజాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా నవీన్‌నగర్ వద్ద లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



ట్రాక్‌పై మృతదేహం

నరసన్నపేట: కొల్లవానిపేట సమీపంలో రన్నింగ్ ట్రైన్ నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. శనివారం ఉదయం ఈ ఘటన జరిగిందని, మృతుడు ఒడిశా వాసిగా గుర్తించామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు. మృతుడి బంధువులు ఆదివారం చేరుకుంటారని, వారు వస్తే పూర్తి సమాచారం తెలుస్తుందని వివరించారు. విశాఖ నుంచి పలాస డౌన్ లైన్‌లో వెళ్తున్న ఈస్ట్‌కోస్ట్ రైలులో ఈయన ప్రయాణిస్తున్నట్లు తెలిసిందన్నారు.